## ఎమ్మెల్యే చిట్టెంను మూడోసారి గెలిపించాలి



ఆత్మకూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబర్ 31: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రీ యాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని రెండో వార్డులో విస్తృతంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. దళితబంధు, బీసీబంధుతో పేదలను ఆదుకోవడమే కాదు కులవృత్తులకు చేయూతనిచ్చి అన్ని వర్గాల అభ్యున్నతికి సర్కారు పాటు పడిందన్నారు. ఈసారి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో సౌభాగ్యలక్ష్మితో మహిళలకు రూ.3వేల భృతి, ఆసరా పింఛన్లు రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంపు, దివ్యాంగులకు రూ.4వేల పింఛన్ నుంచి రూ.6వేలకు పెంచుతారని వివరించారు. ఎమ్మెల్యే చిట్టెంను మళ్లీ గెలిపిస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తారని చెప్పుకుంటూ ప్రచారం సాగించారు. కారుగుర్తుకు ఓటేసి మరోసారి బీఆర్ఎస్‌కు అధికారం కట్టబెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవికుమర్‌యాదవ్, మండల నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్ కమిటీల ప్రతినిధులు, పార్టీ అనుబంధ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలుకల్పించాలి

- ఎన్నికల సిబ్బందికి వసతులు ఏర్పాటు చేయాలి
- రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలి
- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

ఆత్మకూరు, అక్టోబర్ 31: పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో విధిగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలలోని ఓల్డ్ హాల్ పోలింగ్ కేంద్రాన్ని కలరింగ్ చేయాలని సూచించారు. అదేవిధంగా స్నానపు గదులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతిపోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగుల నిమిత్తం ర్యాంపును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అభ్యర్థులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు తప్పక అనుమతి తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించొద్దని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రచారాన్ని పరిశీలించేందుకు సంబంధిత అధికారులను ఇప్పటికే నియమించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**_ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు_**

అమరచింత, అక్టోబర్ 31: పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు విద్యుత్, శానిటేషన్, తాగునీరు సౌకర్యాలను కల్పించాలని నారాయణపేట అదనపు కలెక్టర్ మాయంక్ మిట్టల్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మక్తల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అమరచింత తాసీల్దార్ షేక్‌చంద్‌పాషా, ఆత్మకూర్ సీఐ కేఎస్ రత్నం, అమరచింత ఎస్సై జగన్‌మోహన్, మున్సిపాల్ కమిషనర్ మహ్మద్‌ఖాజాతో కలిసి మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర, బాలికల, ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, మండలంలోని నందిమల్ల, మస్తీపూర్, నందిమల్ల ఎక్స్‌రోడ్డులోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వేసిన నెంబర్లను పరిశీలన చేసి పట్టణంలో ఎంతమంది ఓటర్లు ఏ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకుంటారో వారి వివరాలతో కూడిన జాబితా, ఓటర్లు ఇబ్బందులు పడకుండా తయారు చేసి పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఆత్మకూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఏసి మయాంక్ మిట్టల్

## 'ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలి'

నర్వ, అక్టోబర్ 31: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన నర్వలో బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధిపొందిన ప్రతిఒక్కరూ బీఆర్ఎస్, కేసీఆర్, చిట్టెం వెంట ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా అమలు చేయలేని అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేశారని, అనేక సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రతిగడపకూ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు అయ్యప్ప, నాయకులు శంకర్, వెంకటేశ్వర్‌రావు, అశోక్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఊట్కూర్, అక్టోబర్ 31: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. స్థానిక చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం ఎస్సై గోకారి ఆధ్వర్యంలో నారాయణపేట, మక్తల్ వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

## రూ.11లక్షల నగదు పట్టివేత

కృష్ణ, అక్టోబర్ 31: తెలంగాణలోఎన్నికల కోడ్ సందర్భంగా కృష్ణ మండలంలోని తెలంగాణ-కర్ణాటక బార్డర్ చెక్‌పోస్ట్ చేగుంట వద్ద ఎస్సై విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీ బృందాలతో కలిసి మంగళవారం తనిఖీలు చేశారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా పొరుగు రాష్ట్రాలైన గోవా, కర్ణాటక నుంచి తెలంగాణలోని డబ్బు, మద్యం రవాణాకాకుండా మండలంలోని కృష్ణ బార్డర్ చెక్ పోస్టు వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కృష్ణ మండలంలోని చేగుంట బార్డర్ చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా మాన్వికి చెందిన రాజశేఖర్ ఎలాంటి ఆధారాలు లేకుండా కర్ణాటక నుంచి కారులో రూ.11లక్షలను తరిలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ డబ్బును నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి పంపినట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, ఎస్ఎస్‌బీ ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.




పట్టుబడిన నగదును గీవెన్స్ కమిటీకి అప్పగించిన అధికారులు

## ఖోఖోలో మండల జట్టు సత్తా

దామరగిద్ద, అక్టోబర్ 31: గతలనెల నిర్వహించిన ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో మండల జట్టు విజయం సాధించి ఉమ్మడి జిల్లా జోన్ పోటీలకు ఎంపికైంది. అండర్-14 ఖోఖో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కార్తీక్, శ్రీధర్‌గౌడ్, శివరాజు, హర్ష ఉమ్మడి పాలమూర్ జిల్లాలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారని, ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటప్ప తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్, శివరాములు, సంతోష్, కాళప్ప, బాలరాజు, ప్రవీణ్, సునీత, కవిత, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

నర్వ, అక్టోబర్ 31: శాసనసభ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కోడ్‌ను ఎవరూ అతిక్రమించొద్దని తాసీల్దార్ మల్లారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ పలు మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఇప్పటికే కోడ్ అమలులో ఉండగా కోడ్ పరిధిలోకి వచ్చే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని అందుకు కృషి చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థి కుల, మత, భాష ద్వేషాలను, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదన్నారు. విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై మాత్రమే విమర్శలు ఉండాలని వ్యక్తిగత జీవితంపై విమర్శలకు తావుండకూడదని పేర్కొన్నారు.

## మహిళా సాధికారతకు కృషి

ఊట్కూర్, అక్టోబర్ 31: మహిళా సాధికారతకు కృషి చేద్దామని మహిళా సాధికారత కేంద్రం జండర్ స్పెషలిస్ట్ నర్సింహ అన్నారు. మంగళవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు మహిళల సంక్షేమం, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ క్రాంతి రేఖ సఖి సేవలు, గృహహింస, వరకట్న వేదింపులపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్

నారాయణపేట రూరల్,అక్టోబర్ 31: రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా, శాంతియుతంగా వినియోగించుకొనేందుకు, శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పేట అదనపు ఎస్పీ నాగేంద్రుడు పేర్కొన్నారు. పేట మండల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజాపూర్, కోటకొండలో కేంద్ర సాయుధ బలగాలతో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాలో ఫ్లాగ్ మార్చ్‌లో అదనపు ఎస్పీ, రూరల్ ఎస్సై జయప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ ధైర్యంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న అదనపు ఎస్పీ

## సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి

కృష్ణ, అక్టోబర్ 31: మండలంలోని ఖాన్‌దొడ్డి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేఖర్ ఉపాధ్యాయ బృందంతో కలిసి వల్లభాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. భారతదేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీక అయిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్దార్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**_ఊట్కూర్ మండలంలో..._**

ఊట్కూర్, అక్టోబర్ 31: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం నిడుగుర్తి యూపీఎస్‌లో భారత దేశ మొదటి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే జాతీయ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఖాన్‌దొడ్డిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఊట్కూర్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు